

2వ నివేదిక జూలై 11, 2026

# టీ మరియు సెల్ ఫోన్లు

ఇవోన్ - ఆస్ట్రియా

**సంపాదకుని సందేశం :** ఈ వారం మిషన్ కథ, గతంలో సేకరించిన 'పదమూడవ సబ్బాతు కానుకల సహాయంతో నిర్మించిన ఒక భవనంలో జరిగింది. ఆస్ట్రియాలోని 'బోగెన్ హోపెన్' అనే సెవెంత్-డే ఎడ్వెంటిస్ట్ పాఠశాలలో ఉన్న బాలికల వసతి గృహంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.

ఇవోన్, బ్రానౌలో ఉన్న సెవెంత్-డే ఎడ్వెంటిస్ట్ క్యాంపస్, "బోగెన్ హోపెన్"లో బాలికల డీన్ గా పనిచేయుచున్నారు. వసతి గృహంలోని టీనేజర్లు ప్రతిరోజూ 45 నిమిషాల సేపు మాత్రమే సెల్ ఫోన్ ఉపయోగించాలనే నియమాన్ని ఇవోన్ మెచ్చుకొనెను. సెల్ ఫోన్లు ఎంత వ్యసనంగా మారతాయో ఆమెకు తెలుసు. మరియు ఆ నియమం విద్యార్థులను ఒకరితో ఒకరు ఎక్కువ సమయం గడపడం, మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, మరియు క్యాంపస్‌లోని చిన్న కాలువలో పడవ నడపడం వంటి సరదా కార్యకలాపాలు చేయుటకు ప్రోత్సహించుటను ఆమె గమనించింది.

అయితే నియమాలు ఉన్నప్పుడల్లా, వాటిని ఉల్లంఘించడానికి ప్రయత్నించే విద్యార్థులు కూడా ఉంటారని ఆమెకు తెలుసు. వసతి గృహంలోని కొంతమంది అమ్మాయిల వద్ద 2 ఫోనులు ఉంటె, వారు మొదటి ఫోన్ లను మాత్రమే తిరిగి ఇచ్చి, రెండవ ఫోన్లను దాచిపెట్టారని ఆమె అనుమానించింది. కానీ ఆమె ఏమీ చూడనంత వరకు, ఏమీ చేయలేకపోయింది.

ఒక రోజు, చాలా మంది అమ్మాయిలు తమ గదులలో అనారోగ్యంతో ఉన్నారు. ఆ సాయంత్రం, ఇవోన్ వారికి వేడి వేడిగా మూలికల టీని తీసుకువచ్చింది. ఆమె ఒక అమ్మాయి గదికి టీ తీసుకువెళ్ళినప్పుడు, ఏదో సరిగ్గా లేదని ఆమెకు అనిపించింది.

ఆ గదిలోకి ప్రవేశించడానికి, ఇవోన్ రెండు తలుపులు ---ఒకటి బయటి తలుపు, మరొకటి లోపలి తలుపు దాటి వెళ్లాల్సి వచ్చింది. ఆమె బయటి తలుపు తట్టి, దానిని తెరిచింది. లోపలి తలుపు వెనుక ఏదో కదులుతున్న శబ్దం వినిపించడంతో, అక్కడ ఏం జరుగుతుందోనని ఆలోచిస్తూ ఆమె ఒక్క క్షణం ఆగిపోయింది. ఆమె లోపలి తలుపు తెరిచి చూసినప్పుడు, అక్కడ అసాధారణంగా ఏమీ కనిపించలేదు. ఆ 16 ఏళ్ల బాలిక మంచం మీద పడుకుని ఉంది. టీ ఇచ్చినందుకు ఇవోన్ కు ఆమె కృతజ్ఞతలు చెప్పి, "మీరు ఎప్పుడు నిద్రపోతారు? మరలా మీరు వచ్చి నన్ను చూస్తారా ?" అని అడిగింది.

ఇవోన్ తన మనసులో ఎందుకని ఆ బాలిక అలా అడిగింది, అని తలంచినది.'

ఆమె మిగిలిన బాలికలను పలకరించి, వారి యోగక్షేమాలు తెలుసుకొని వెళ్ళిపోయింది. సుమారు 10 నిమిషాల తర్వాత, ఎటువంటి ముందస్తు సమాచారం

లేకుండానే, “ మరలా మీరు వచ్చి నన్ను చూస్తారా ?” అని అడిగిన ఆ 16 ఏళ్ల బాలిక గదికి తిరిగి వచ్చింది. ఆమె బయటి తలుపు తట్టింది; ఆ తర్వాత లోపలి తలుపు తెరిచినప్పుడు, ఆ బాలిక ఏదో వస్తువును తన దుప్పటి కిందకు వేగంగా దాచడాన్ని ఆమె గమనించింది. ఇప్పుడు, అక్కడ పరిస్థితి ఏదో తేడాగా ఉన్నట్లు ఇవోన్ కు పూర్తిగా అర్థమైంది. ఆమె ఇప్పుడు ఏం చేయాలి?

ఆమె తన ఇంటికి తిరిగి వెళ్లి, ఆ రాత్రి వేళలో , ఇలా ప్రార్థించింది: “ప్రభూ, ఈ బాలికకు సహాయం చేయడానికి నాకు తోడుగా ఉండు.”

తెల్లవారుజామున 4 గంటల సమయంలో, ఆ బాలిక గదికి తిరిగి వెళ్లాలనే బలమైన ప్రేరణతో ఆమె నిద్రలేచింది. ఆమె ఇలా ఆలోచించుకుంది: ‘ఎందుకు? ఆమె నిద్రపోతోంది కదా. నువ్వు వెళ్తే ఆమెకు నిద్ర భంగం కలుగుతుంది.’ అప్పుడు ఆమెకు మరో ఆలోచన తట్టింది: ‘బహుశా ఆమెకు ఒంట్లో బాగోలేదేమో.’

ఇవోన్ ఆ అమ్మాయి గదికి వెళ్లి బయటి తలుపు తెరిచింది. రెండవ తలుపు కింద నుండి వెలుగు వస్తోంది. ఆమె తలుపు తెరిచి చూడగా, ఆ అమ్మాయి మంచం మీద తన సెల్ ఫోన్ చూస్తూ ఉంది. నిశ్శబ్దంగా తలుపు మూసి, ఇవోన్ తన ఆఫీసుకు వెళ్లి మోకరిల్లి ప్రార్థించింది. “ప్రభూ, నేను ఏమి చేయాలి?”

ఈసారి, ఆ అమ్మాయితో మాట్లాడాలని ఆమెకు అనిపించింది. ఇవోన్ గదికి తిరిగి వచ్చి, తర్వాతి రెండు గంటల పాటు ఆ విద్యార్థినితో మాట్లాడింది. వారి సంభాషణ ముగింపులో, ఆ అమ్మాయి ఇలా అంది, “మీకు తెలుసా, నా రెండవ ఫోన్‌ను మీకు ఇవ్వడం నాకు ఇష్టం లేదు, కానీ ఇన్నాళ్లూ దానినే వాడుతున్నాను. అయితే ఇప్పుడు, దాన్ని వదులుకోవడం సులభం, ఎందుకంటే మీరు నిజంగా నా గురించి శ్రద్ధ తీసుకుంటారని నాకు తెలుసు.”

ఇవోన్ చాలా సంతోషించింది. తాను ఆ బాలిక పట్ల క్రూరంగా ప్రవర్తించడం లేదని, ఎలక్ట్రానిక్స్ వ్యసనాన్ని అధిగమించడంలో సహాయం చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆ అమ్మాయి గ్రహించింది. ఆ రోజు తెల్లవారుజామున, ఆ అమ్మాయి తన ఎలక్ట్రానిక్స్‌కు బదులుగా దేవునిని ఎంపిక చేసుకున్నది.

మీరు సమర్పించుచున్న పదమూడవ సబ్బాతు కానుకలకై మీకు కృతజ్ఞతలు.

ఈ కానుకలనే క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ కానుకలు అని కూడా అంటారు.

ఇవి వ్యసనాన్ని జయించడానికి మనకు శక్తినిచ్చే దేవుని వద్దకు ప్రజలను నడిపిస్తుంది.

ఆస్ట్రియాలోని బ్రౌనౌ సమీపంలో ఉన్న బోగెన్‌హోఫెన్, ఈ కథ జరిగిన బాలికల వసతి గృహాన్ని తెరవడానికి 1986 కానుకలో కొంత భాగం వినియోగించ బడినది.

ఈ త్రి మాసము యొక్క 13వ సబ్బాతు కానుకలు , ఆస్ట్రియాతో పాటు ఇంటర్-యూరోపియన్ డివిజన్ అంతటా, మరింత మంది ప్రజలను దేవుని వద్దకు నడిపించడానికి సహాయపడుతుంది.